సాక్షి చిత్తూరు


సోమవారం । 24 । జూన్ । 2024



ఘనంగా ద్రౌపదీ తిరునాళ్ల
నింద్ర మండలం అత్తూరులో ద్రౌపదీ దేవి తిరునాళ్లలో భాగంగా ఆదివారం అగ్నిగుండ ప్రవేశం చేశారు. - 8లో



బోయకొండలో భక్తుల రద్దీ
బోయకొండ గంగమ్మ దర్శనార్థం పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు తరలిరావడంతో ఆదివారం రద్దీ పెరిగింది. - 8లో



భారీగా పెరిగిన టమాట ధర
ఈ వారం టమాట ధర భారీగా పెరిగింది. పలమనేరు మార్కెట్లో 14 కిలోల బాక్స్ ఒకటి రూ.1,090 పలికింది. - 8లో

న్యూస్‌రీల్

25న జిల్లాకు సీఎం చంద్రబాబు



సీఎం పర్యటన ప్రదేశాలను పరిశీలిస్తున్న జేసీ, జిల్లా ఎస్పీ మణికంఠ

కుప్పం: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 25, 26 తేదీల్లో కుప్పం పర్యటనకు వస్తున్న నేపథ్యంలో, జిల్లా ఎస్పీ మణికంఠ, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదివారం ఆయా ప్రాంతాలను పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లపై అడ్వాన్స్ సెక్యూరిటీ లైజనింగ్ నిర్వహించారు. సీఎం పర్యటించే ప్రాంతాల్లో వాహనాల రాకపోకలపై సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. పీఈఎస్ కళాశాల ప్రాగణంలో హెలిప్యాడ్, జల్లిగానిపల్లి, చిన్నారిదొడ్డి గ్రామాల వద్ద, హంద్రీనీవా కాలువ సందర్శించే ప్రదేశాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆర్ అండ్ బీ అతిథి గృహం, బస్టాండు ప్రాంగణంలో జరిగే బహిరంగ సభ ఏర్పాట్లు సందర్శించారు. ముఖ్యమంత్రి పర్యటనకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ మణికంఠ తెలిపారు. పర్యటన ప్రదేశాల్లో ఇన్‌చార్జులుగా నియమితులైన అధికారులు బాధ్యతగా నిర్వహించాలని జేసీ శ్రీనివాసులు తెలిపారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా భద్రత, ట్రాఫిక్ అంశాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ రాజశేఖర్, పీఆర్, ఆర్అండ్‌బీ ఎస్ఈలు చంద్రశేఖర్ రెడ్డి, ఉమా మాహేశ్వర్ రెడ్డి, కుప్పం డీఎస్పీ శ్రీనాథ్ పాల్గొన్నారు.

కోడి పిల్ల టమాటా



నగరి : పట్టణ పరిధిలోని కూరగాయల మార్కెట్‌లో ఒక మహిళ కొనుగోలు చేసిన టమాటల్లో ఒక టమాటా కోడిపిల్ల ఆకారంలో ఉండడం అందరినీ ఆశ్చర్యపరచింది. ఈ టమాటాను స్థానికులు ఆసక్తి చూపారు. అప్పుడప్పుడూ కూరగాయలు ఇలా వేర్వేరు రూపాల్లో వస్తుంటాయని దుకాణదారులు తెలిపారు.

గురుకులకు దరఖాస్తు చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కో-ఆర్డినేటర్ జయభారతి తెలిపారు. ఆమె ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో 6,7,8,9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ చేయనున్నట్లు చెప్పారు. ఖాళీగా ఉన్న గురుకుల పాఠశాలల్లో దరఖాస్తును అందజేసి ఈ నెల 27వ తేదీన ప్రవేశ పరీక్ష రాయాల్సి ఉంటుందని తెలిపారు. ఆ ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణత పొందితే అడ్మిషన్ ఇవ్వనున్నట్లు డీసీఓ వెల్లడించారు.

చెరువు మట్టి.. చెరబట్టి

జిల్లాలో ఒకవైపు చెరువులు, కొండల మట్టి లూటీ.. మరో వైపు చెరువులు, కాలువల కబ్జాలకు తెలుగుదేశం పార్టీ నాయకులు బరితెగిస్తున్నారు. మా ప్రభుత్వం వచ్చింది..మా ఎమ్మెల్యే చెప్పాడు.. మా ఇష్టం వచ్చినట్లు చేస్తాం అంటూ తెగేసి చెబుతున్నారు. పెళ్లకూరు మండలంలో గోరంత అనుమతులు అడ్డం పెట్టుకుని చెరువులు, కొండలు, వాగులు, ప్రభుత్వ భూముల్లో యంత్రాలతో టీడీపీ నేతలు యథేచ్ఛగా గ్రావెల్ తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే పేరు చెబుతూ చెరువులు, కాలువలను అడ్డూ అదుపు లేకుండా ఆక్రమించుకుంటున్నారు. ప్రశ్నించే వారిపై తిరగబడుతూ మీపై కేసులు పెట్టిస్తాం అంటూ రెచ్చిపోతున్నారు. కబ్జాను అడ్డుకునేందుకు ప్రయత్నించిన గ్రామ సహాయకుడిపైనే దాడి చేసేందుకు తెగబడ్డారు.





పెళ్లకూరు మండలం యర్రగుంట చెరువులో యంత్రాలతో గ్రావెల్ తవ్వకాలు

మొదలైన అధిక్కారం
- అనుమతులు గోరంత.. తవ్వకాలు కొండంత
- చెరువులు..కొండలు కొల్లగొడుతున్న పెళ్లకూరు టీడీపీ నేతలు
- చంద్రగిరిలో చెరబడుతున్నారు..!
- ఎమ్మెల్యే నాని పేరుతో కబ్జాల పర్వం

సాక్షి టాస్క్‌ఫోర్స్: పెళ్లకూరు మండలానికి చెందిన కొందరు సీనియర్ టీడీపీ నేతలు నందిమాల, యర్రగుంట, శిరసనంబేడు, రోసనూరు, రాజుపాళెం, అర్ధమాల తదితర గ్రామాల్లో యంత్రాలతో గ్రావెల్ తవ్వకాలు ప్రారంభించారు. ప్రయివేట్ కంపెనీలకు గ్రావెల్‌ను విక్రయించి జేబులు నింపుకుంటున్నారు. ఇక్కడి అధికారులు తమకేమీ పట్టదన్నట్టు వ్యవహరిస్తున్నారు. మండల పరిధిలోని శిరసనంబేడు గ్రామంలో సిద్ధేశ్వరస్వామి కొండ సమీపంలోని అసైన్‌మెంట్ భూములు, యర్రగుంట చెరువులో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు మళ్లీ మొదలయ్యాయి. నాయుడుపేట పరిసరాల్లో వేస్తున్న లేఅవుట్లు, మేనకూరు సెజ్‌లో పరిశ్రమలు, 71వ జాతీయ రహదారి రోడ్డు అభివృద్ధి పనులకు గ్రావెల్, మట్టి అవసరం ఏర్పడింది. దాంతో గ్రావెల్, మట్టికి గిరాకీ ఉంది. ఈ క్రమంలో టీడీపీ నాయకులు మైనింగ్, రెవెన్యూ అధికారులకు మామూళ్లు ఇస్తూ నిత్యం యంత్రాలతో తవ్వకాలు చేపట్టి లారీలతో యథేచ్ఛగా తరలిస్తూ రూ.కోట్లు ఆర్జిస్తున్నారు. యంత్రాలతో తవ్వకాలు చేపట్టడంతో ప్రమాదకర స్థాయిలో గోతులు ఏర్పడుతున్నాయి. అలాగే లారీలు, టిప్పర్లు, ట్రాక్టర్లు రేయింబవళ్లు గ్రావెల్‌ను తరలిస్తుండడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లు అధ్వానంగా మారుతున్నాయి. మైనింగ్, రెవెన్యూ అధికారులు టీడీపీ నేతలు అందించే మామూళ్లకు అలవాటుపడి పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

కోర్టు ఆదేశాలు బేఖాతర్
శిరసనంబేడు, రోసనూరు, అర్ధమాల, నందిమాల, యర్రగుంట గ్రామ పరిసరాల్లో గ్రావెల్ తవ్వకాలు చేపట్టకూడదని కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. ఇక్కడి టీడీపీ నేతలు వాటిని బేఖాతర్ చేస్తూ గ్రావెల్ తవ్వకాలను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ధనార్జనే లక్ష్యంగా అక్రమ వ్యాపారాలను మొదలు పెట్టడంపై స్థానికులు నిరసన పర్వానికి సిద్ధమయ్యారు.

అనుమతులున్నాయంటూ..
టీడీపీ నాయకులు ఐదు వేల క్యూబిక్ మీటర్ల వరకు గ్రావెల్ తవ్వకాలకు మాత్రమే మైనింగ్ అధికారుల నుంచి అనుమతులు తీసుకున్నారు. అయితే నిబంధనలను ఉల్లంఘించి 50 వేల క్యూబిక్ మీటర్లకు పైగా తవ్వకాలు చేపడుతున్నారు. దీనిపై స్థానికులు ప్రశ్నిస్తున్నా ప్రయోజనం లేకుండా పోతోంది. చెరువుల్లో పది అడుగులకంటే ఎక్కువ లోతు గుంతలు తవ్వేశారు. తద్వారా వర్షాకాలంలో మూగజీవాలకు ప్రమాదం పొంచి ఉందని, పిల్లలు కూడా ఈతకు వెళ్లి అందులో మునిగిపోయే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా మైనింగ్ ఉన్నతాధికారులు స్పందించి అసైన్‌మెంట్ భూములు, చెరువులు, గుంతలు, కొండ ప్రాంతాల్లో అక్రమ తవ్వకాలను అరికట్టాలని కోరుతున్నారు.



పెళ్లకూరులో మట్టి తరలించేందుకు సిద్ధంగా ఉన్న వాహనాలు

మా ప్రభుత్వం వచ్చింది.. మా నాని చెప్పాడు
తిరుపతి రూరల్ మండలం పేరూరు సర్వే నంబర్ 546లో 184.5 ఎకరాల్లో ఆ చెరువు విస్తరించి ఉంది. తిరుపతి–చిత్తూరు జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఈ విలువైన చెరువుపై తాజాగా అధికారపార్టీ ఎమ్మెల్యే నాని అనుచరుల కన్ను పడింది. ఎంపీటీసీ మాజీ సభ్యుడు కాయం కనుసన్నల్లో ఈ చెరువు ఆక్రమణలకు నాలుగు రోజులుగా ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయి. పేరూరు ధర్మరాజుల గుడి వెనుక చెక్ డ్యామ్‌కు ఆనుకుని దాదాపు రూ.2 కోట్ల విలువైన 250 అంకణాల చెరువును ఆక్రమించేందుకు జేసీబీలతో చదును చేశారు. పెద్ద పెద్ద చెట్లను సైతం కూల్చివేసి చెరువు కట్టను ధ్వంసం చేశారు. చెరువును ఆక్రమించడమే కాకుండా కట్టను ధ్వంసం చేస్తున్న ఎమ్మెల్యే నాని అనుచరులను అడ్డుకునేందుకు స్థానికులు ప్రయత్నించారు. 'మా ప్రభుత్వం వచ్చింది. మా ఎమ్మెల్యే నాని చెప్పాడు...మా ఇష్టం వచ్చినట్టు చేస్తాం...చెరువును ఆక్రమిస్తే మీకు ఏమిటి నష్టం... అడ్డుకుంటే కేసులు పెడతాం...' అంటూ టీడీపీ నేతలు బెదిరిస్తున్నట్లు స్థానికులు వాపోతున్నారు.

కాలువ కట్ట మాయం
పేరూరు పంచాయతీలోనే జాతీయ రహదారికి సమీపంలోని సర్వే నంబర్ 80లో కాలువ పోరంబోకు ఉంది. రామానుజపల్లి చెరువు నుంచి తుమ్మలగుంట చెరువుకు వచ్చే ప్రధాన కాలువ ఇది. దీన్ని పేరూరుకు చెందిన చోటా నేతలు ఆక్రమించేందుకు చదును చేశారు. దాదాపు రెండు కోట్ల విలువైన 300 అంకణాలను ఆక్రమించారు. ఉపాధి నిధులతో చేసిన పనులను సైతం ధ్వంసం చేశారు. కాలువ కట్ట రూపురేఖలు మాయం చేశారు. ఇక్కడా అంతే... ఎమ్మెల్యే నాని చెప్పాడు... మా ప్రభుత్వం వచ్చింది.. మేము ఆక్రమిస్తాం.. అడ్డుకుంటే మా ప్రతాపం చూపుతాం ... అంటూ బెదిరిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. పేరూరు చెరువు, కాలువ స్థలాల్లో జరుగుతున్న ఆక్రమణలను పరిశీలించామని, వాటిని ఆపినట్లు స్థానిక వీఆర్వో అనిల్ తెలిపారు.



పైడిపల్లె పంచాయతీలో మట్టి తెచ్చి కాలువను పూడ్చి వేస్తున్న టిప్పర్

చర్యలు తీసుకుంటాం
యర్రగుంట, నందిమాల చెరువులు, రోసనూరు, అర్ధమాల అటవీ భూములు, పలు ప్రాంతాల్లోని అసైన్‌మెంట్ భూముల్లో అక్రమంగా తవ్వకాలు చేస్తున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయి. జిల్లా మైనింగ్ అధికారులతో మాట్లాడి అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకుంటాం.

– ప్రసాద్‌రావు, తహసీల్దార్, పెళ్లకూరు

కాలువ కబ్జా
తిరుపతి రూరల్ మండలం పైడిపల్లె పంచాయతీలో రూ.3 కోట్ల విలువైన దాదాపు 50 సెంట్ల కాలువను టీడీపీకి చెందిన పిల్లపాళెం పరంధామరెడ్డి కబ్జా చేస్తున్నాడు. గతంలో కాలువ కబ్జాను కాపాడాలని తిరుపతి రూరల్ తహసీల్దార్, రెవెన్యూ అధికారులపై వాగ్వాదం చేసి, కోర్టులో కేసులు వేసింది ఆయనే. ఇప్పటికీ కోర్టులో తహసీల్దార్‌పై కేసు నడుస్తోంది. కాలువను కాపాడుతున్న వ్యక్తి అని గ్రామస్తులు కీర్తించిన ఈ పరంధామరెడ్డి రాష్ట్రంలో అధికారం మారగానే కబ్జారాయుడిగా మారాడు. సర్వే నెంబర్ 187లోని కాలువగా ఉన్న దాదాపు 50 సెంట్ల స్థలాన్ని ఆక్రమించాడు. పట్టపగలే భారీ టిప్పర్లతో మట్టిని తెచ్చి కాలువను పూడ్చివేస్తున్నాడు. గ్రామస్తులు, మీడియా ప్రతినిధులు సైతం ప్రశ్నిస్తే..ఎమ్మెల్యే నానికి చెప్పాం...ఆయన ఆక్రమించుకోమన్నాడు...గతంలో కోర్టులో కేసులు వేసింది వాస్తవమే...ఇప్పటికీ కేసు ఉంది. అయితే ఏంటీ..మా ఎమ్మెల్యేకి చెప్పే చేసుకుంటున్నాం... అంటూ తీవ్ర పదజాలంతో దుర్భాషలాడుతున్నాడు. కబ్జాను అడ్డుకునేందుకు ప్రయత్నించిన గ్రామ రెవెన్యూ సహాయకుడిపై దాడి చేసేందుకు ప్రయత్నించాడు. స్థానికులు ఇన్‌చార్జ్ తహసీల్దార్ మారుతికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. అయితే రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై దీని వెనుక ఎమ్మెల్యే నాని హస్తం ఉన్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా తిరుపతి రూరల్ మండలంలోని పలు పంచాయతీల్లో చెరువులు, కాలువలను ఎమ్మెల్యే నాని పేరు చెప్పి ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, నీటి వనరులను కాపాడాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.




పేరూరులో ఆక్రమించేందుకు అక్రమార్కులు చదును చేసిన కాలువ కట్ట



తిరుపతి రూరల్ మండలం పేరూరు పంచాయతీలో టీడీపీ నేతలు చెరువు కట్టను ధ్వంసం చేసి ఆక్రమించేందుకు చదును చేసిన దృశ్యం

సూర్యచంద్రులపై అనంత తేజోమూర్తి



సూర్యప్రభపై వెలుగొందుతున్న గోవిందుడు



చంద్రప్రభపై ఊరేగుతున్న శ్రీవారు



ఊంజల్ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

- వైభవంగా సాగుతున్న ప్రసన్నుడి బ్రహ్మోత్సవాలు
- అప్పలాయగుంటలో నేడు రథోత్సవం

పుత్తూరు: అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో ఏడవరోజు ఆదివారం వైకుంఠనాథుడు సూర్య, చంద్రప్రభ వాహనాలపై అనంత తేజోమూర్తిగా భక్తులకు దర్శనమిచ్చారు. పట్టుపీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలతో ముగ్ధమనోహర రూపంలో గోవిందుడు ప్రత్యక్ష దైవాలైన సూర్య చంద్రులపై ఆశీనులై అశేష భక్తులను కటాక్షించారు. ఉదయం 5 గంటలకు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి విశ్వరూప దర్శనం, తోమాలసేవ, కొలువు, అర్చన, మొదటి గంట తదితర కార్యక్రమాలు నిర్వహించారు. 7.30 గంటలకు శ్రీవారిని వాహన మండపంలోకి వేంచేపు చేశారు. 8 నుంచి 9 గంటల వరకు ప్రసన్న వేంకటేశ్వరుడు చంద్రప్రభ వాహనంపై ఊరేగుతుండగా అశేష భక్తుల గోవింద నామస్మరణతో మాడవీధులు మార్మోగాయి. అనంతరం భక్తులను స్వామివారి సర్వదర్శనానికి అనుమతించారు. తదుపరి శుద్ధి, రెండవ గంట కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటల నుంచి 6.30 గంటల వరకు భక్తి కీర్తనల ఆలాపనల మధ్య స్వామివారి ఊంజల్ సేవ కనుల పండువగా సాగింది. అనంతరం శ్రీవారు వాహన మండపంలోకి వేంచేపు చేశారు.



కనువిందు చేసిన యువతుల కోలాటం

చంద్రప్రభపై చిద్విలాసంగా..
బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి 7 గంటలకు శ్రీవారు చంద్రప్రభ వాహనంపై పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో చిద్విలాసంగా విహరిస్తుండగా అశేష భక్తజనం గోవిందనామ స్మరణలతో మాడవీధులు మార్మోగాయి. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, యువతుల ఆనందడోలికల కోలాటం నడుమ స్వామివారు అశేష భక్తజనానికి అభయమిచ్చారు. భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించి స్వామివారిని కనులారా దర్శించుకున్నారు. వాహన సేవ అనంతరం స్వామివారికి ఏకాంత సేవ నిర్వహించారు. ఏఈఓ రమేష్, ఆలయ సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు..
బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 9.25 గంటల నుంచి 11 గంటల వరకు రథోత్సవం, సాయంత్రం 5.30 గంటల నుంచి 6.30 వరకు ఊంజల్ సేవ, రాత్రి 7 గంటల నుంచి 8 వరకు అశ్వ వాహనంపై స్వామి వారు విహరిస్తారు.

ప్రభుత్వ బడి నుంచి ఐఏఎస్ స్థాయికి

- ప్రజలకు సేవ చేయాలన్న తపనతో సివిల్స్ వైపు
- నేడు విధుల్లోకి నూతన కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ



కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : సామాన్య పేద కుటుంబంలో జన్మించి ప్రభుత్వ బడిలో విద్యనభ్యసించి ఐఏఎస్ అయ్యారు నూతన కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ. పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆయన్ను రాష్ట్ర ప్రభుత్వం చిత్తూరు కలెక్టర్‌గా నియమించింది. ప్రస్తుతం కలెక్టర్‌గా పనిచేస్తున్న సగిలి షణ్మోహన్‌ను కాకినాడ జిల్లాకు బదిలీ చేశారు. కాకినాడకు బదిలీ అయిన కలెక్టర్ షణ్మోహన్ ఆదివారం రిలీవ్ అయ్యారు. ఇన్‌చార్జి కలెక్టర్ బాధ్యతలను జేసీ శ్రీనివాసులుకు అప్పజెప్పారు. నూతన కలెక్టర్ సోమవారం కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించనున్నారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఈ నెల 25, 26 తేదీల్లో సీఎం చంద్రబాబు కుప్పం పర్యటనకు వస్తుండడంతో ఆ పర్యటన ఏర్పాట్లను నూతన కలెక్టర్ పర్యవేక్షించనున్నారు.

29 ఏళ్ల వయసులో మొదటి పోస్టింగ్
నూతన కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ 2014లో సివిల్స్‌కు ఎంపికైన తర్వాత అనంతపురం ట్రైనీ కలెక్టర్‌గా శిక్షణ పూర్తి చేశారు. ఆ తర్వాత మొదటగా 29 ఏళ్ల వయసులో ఆయన పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం సబ్‌కలెక్టర్‌గా మొదటి పోస్టింగ్ వచ్చింది. ఆ తర్వాత పాడేరు ఐటీడీఏ, శ్రీకాకుళం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. జిల్లాల పునర్విభజన తర్వాత అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ నియమితులయ్యారు. ఎన్నికల సమయంలో పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్‌గా నియమితులై ఆ జిల్లాలో సార్వత్రిక ఎన్నికలను నిర్వహించారు. ప్రస్తుతం అక్కడ నుంచి చిత్తూరు కలెక్టర్‌గా నియమితులై జిల్లాకు రానున్నారు. 2022లో అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న సమయంలో ప్రతి వారం ఆ జిల్లాలో నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలైన రంపచోడవరం, ఇతర ప్రాంతాల్లో పర్యటించేవారు. ప్రతి వారం 200 కి.మీ మేరకు నక్సల్స్ ప్రాంతాల్లో పర్యటించి రెండు రోజుల పాటు అక్కడే బసచేసి గిరిజనుల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించి ప్రజల మన్ననలు పొందారు. ఆయన విధులు నిర్వహించిన ఉద్యోగ జీవితంలో పాలనాపరంగా ఎన్నో సంస్కరణలు చేపట్టి ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్నారు.

ప్రజలకు సేవ చేయాలనే తపనతో...
హర్యానా రాష్ట్రం రోహతక్ జిల్లాలోని కోనూర్ అనే చిన్న గ్రామంలో సుమిత్ కుమార్ జన్మించారు. మధ్య తరగతి కుటుంబంలో జన్మించిన ఆయన పదవ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించారు. ఆ తర్వాత గురుగావ్‌లో ఇంజినీరింగ్ పూర్తి చేశారు. ఇంజినీరింగ్ పూర్తి అయిన తర్వాత నాలుగేళ్ల పాటు ఐటీ ఉద్యోగిగా పనిచేశారు. అయితే ఆయనకు చిన్నతనం నుంచి ఐఏఎస్ అయి ప్రజలకు సేవ చేయాలనే కోరిక ఉండడంతో సివిల్స్‌కు సిద్ధమయ్యారు. ఐటీ ఉద్యోగం చేస్తూనే రెండవ ప్రయత్నంలో 2014లో ఐఏఎస్‌కు ఎంపికయ్యారు.

క్లుప్తంగా

మెగా డీఎస్సీ వెంటనే నిర్వహించాలి

తిరుపతి ఎడ్యుకేషన్: ఎన్నికల హామీల్లో భాగంగా మెగా డీఎస్సీని వెంటనే నిర్వహించి ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టాలని, అంతవరకు అవసరమైన చోట విద్యా వలంటీర్లను నియమించి బోధన చేపట్టాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తిరుపతిలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం ఆ సంఘం జిల్లా సహాధ్యక్షుడు కేఎస్‌బీ సూర్యప్రకాష్ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జీఓ 117ను రద్దు చేసి ప్రాథమిక విద్యావ్యవస్థను గాడిలో పెట్టాలని కోరారు. ప్రాథమిక విద్యావ్యవస్థలో పెద్ద మొత్తంలో ఏకోపాధ్యాయ పాఠశాలల్లో రెండో ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాలరెడ్డి మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటుచేసి కొత్త పీఆర్సీని ప్రకటించాలని, ఆలోపు 33 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా గౌరవాధ్యక్షుడు కె.శేఖర్ మాట్లాడుతూ హైస్కూల్ ప్లస్‌లో అవసరమైన పోస్టులను మంజూరు చేసి అర్హత గల వారికి పదోన్నతి కల్పించాలని, అలాగే ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న నెలసరి పదోన్నతులు సైతం ఇవ్వాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కోశాధికారి రమేష్‌నాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దేవరాల నిర్మల, జిల్లా కార్యదర్శులు దండు రామచంద్రయ్య, బండి మధుసూదన్‌రెడ్డి, ప్రభాకర్ పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల వేదిక

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 24వ తేదీన కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో అందజేసి పరిష్కారం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

భారీగా పెరిగిన టమాట ధర

- పలమనేరులో బాక్సు ధర రూ.1090
- బయటి రాష్ట్రాల్లో భారీ డిమాండ్

పలమనేరు: జిల్లాలోని మార్కెట్లలో టమాట ధర రోజురోజుకీ పెరుగుతోంది. టమాట మార్కెట్‌లో గత పది రోజులుగా ధరలు పెరుగుతూ ప్రస్తుతం 14కిలోల బాక్సు ధర రూ.1000నుంచి రూ.1090కి చేరుకుంది. బయటి రాష్ట్రాలనుంచి వ్యాపారులు జిల్లాలోని మార్కెట్లకు తరలి వస్తుండడం, ఇదే సమయంలో కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల్లో సరుకు లేకపోవడంతో ధరల పెరుగుదలకు కారణమైందని వ్యాపారులు చెబుతున్నారు. ముఖ్యంగా ఈ సీజన్‌లో ఎక్కువగా కర్ణాటకలోని కోలారు జిల్లానుంచి టమాట వస్తుండేది. అయితే అక్కడ వైరస్ తెగులు, వర్షాల కారణంగా పంటకు నష్టం వాటిల్లింది. ఏదేమైనా స్థానికంగా టమాట కోతకొస్తున్న రైతులకు ప్రాణం లేచివచ్చింది.

వ్యాపారుల చూపు ఇటువైపే...

జిల్లాలోనే టమాట సాగు ఎక్కువగా పలమనేరు రెవెన్యూ డివిజన్‌లో ఉంది. పలమనేరు, పుంగనూరు, వీకోట, సోమల, సదుంలలో టమాటా మార్కెట్లున్నాయి. గత సీజన్‌లో టమాటాకు ఆశించిన ధర లేదు. దీంతో ఈదఫా రైతులు పూర్తి స్థాయిలో టమాట సాగుచేయలేదు. ఖరీఫ్ సీజన్ ఆరంభానికి ఇక్కడి మార్కెట్లకు 200 లోడ్లు టమాటాలు రావాల్సి ఉండగా ఇప్పుడు వంద లోడ్లు మాత్రమే వస్తున్నాయి. ఇదే సమయంలో మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల్లో టమాటాలు లేవు. కోలారు జిల్లాలో వర్షాలు, వైరస్ కారణంగా పంట దిగుబడి పడిపోయింది. ప్రస్తుతం పలమనేరు, పుంగనూరు, కర్ణాటకలో సరిహద్దు గ్రామాలు, అన్నమయ్య, అనంతపూర్ ప్రాంతాల నుంచి మాత్రమే టమాటాలు వస్తున్నాయి. దీంతో బయటి రాష్ట్రాల వ్యాపారులు ఇక్కడి మార్కెట్లకు వస్తున్నారు. కావాల్సినంత సరఫరా లేకపోవడం ఇదే సమయంలో డిమాండ్ ఎక్కువగా ఉండడంతో ధరలు పెరుగుదలకు కారణమైంది.



పలమనేరు మార్కెట్‌కు వచ్చిన టమాటాలు

పలమనేరు డివిజన్‌లో సాగు వివరాలు

వేసవిలో టమాట	: 5 వేల హెక్టార్లు సాధారణ సాగు
ప్రస్తుతం సాగైన పంట	: 4వేల హెక్టార్లు
ఇప్పుడు కోతదశలో ఉన్న తోటలు	: 2వేల హెక్టార్లు
ఏటా మండీలకు వచ్చే సరుకు	: 200 లారీ లోడ్లు
ప్రస్తుతం మార్కెట్లకు చేరుతున్న సరుకు	: 100 లోడ్లు

ఈ నెలంతా ఆశాజనకమే



బయటి రాష్ట్రాల్లో టమాటాలు లేకపోవడం స్థానికంగానూ సరుకు తక్కువగా ఉండడంతో టమాటాకు ధర వచ్చింది. ఈ నెలంతా ధరలు బాగానే ఉండే అవకాశం ఉంటుంది. ఇప్పుడు పిందె, కోత దశలో ఉన్న తోటలకు సైతం ధరలు బాగానే ఉండొచ్చు. ధరలు బాగుంటే మాకు కూడా సంతోషమే. అయితే వర్షాల కారణంగా సరుకు దిగుబడి తగ్గింది. కానీ ధర బాగుంది కాబట్టి టమాటా ఉన్న రైతులకు లాటరీ వచ్చినట్టే.

– అప్జల్, టమాట మండీ నిర్వాహకులు, పలమనేరు

బోయకొండలో పెరిగిన రద్దీ

చౌడేపల్లి: కోరిన కోర్కెలు తీర్చే ఆరాధ్య దైవంగా పేరుగాంచిన బోయకొండ గంగమ్మతల్లి దీవెనల కోసం భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. బోయకొండ జనసంద్రంగా మారింది. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలనుంచి వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం వివిధ వాహనాల్లో తరలివచ్చారు. ఒక్క రోజే సుమారు 20 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని అధికారులు వెల్లడించారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక పూలు, బంగారు ఆభరణాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు పిండి, నూనెదీపాలు, దీవెలతో మేళతాళాల నడుమ జంతు బలులిచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు.



ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

ఆలయ అధికారుల ఆధ్వర్యంలో అమ్మవారి తీర్థప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకుందాం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ సంఘ నేతలు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకుందామని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో ఆదివారం ఆఫీస్ బేరర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్–117ను రద్దు చేయాలన్నారు. పాఠశాలల విలీనం నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు సోమశేఖర నాయుడు మాట్లాడుతూ ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి సత్వరమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘాలతో, మేధావులతో సమావేశం నిర్వహించి అసంబద్ధ, వివాదాస్పద ఉత్తర్వులను రద్దు చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మణిగంఠన్ మాట్లాడుతూ బోధనేతర కార్యక్రమాల నుంచి టీచర్లకు ఉపశమనం కల్పించాలని కోరారు. అనంతరం ఆ సంఘ నాయకులు ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందాం అనే కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు సుధాకర్‌రెడ్డి, మునిరత్నం, ప్రసన్న కుమార్, ప్రకాష్, ఎస్.పీ బాషా పాల్గొన్నారు.

గ్రామీణ వైవిధ్య కథలు 'మడకెద్దులు'



మడకెద్దులు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు, సాహితీ వేత్తలు

తిరుపతి కల్చరల్: 'మడకెద్దులు' కథల సంపుటిలో రచయిత పేరూరు బాలసుబ్రమణ్యం గ్రామీణ సమాజాన్ని ఆవిష్కరించారని రాయలసీమ అధ్యయనాల సంస్థ అధ్యక్షుడు భూమన్ కొనియాడారు. తెలుగు భాషోద్యమ సమితి ఆధ్వర్యంలో కథా రచయిత పేరూరు బాలసుబ్రమణ్యం రచించిన మడకెద్దులు కథల పుస్తకావిష్కరణ సభ ఆదివారం ఎస్వీయూ గ్రంథాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథి గా విచ్చేసిన ఆయన పుస్తకాన్ని ఆవిష్కరించియ మాట్లాడుతూ సంపుటిలోని కథలు సామాజిక స్పృహతో వాస్తవ సంఘటలను ఆధారంగా రాసినవని, ఎంతో మదన పడితే తప్ప ఇలాంటి రచన సాగదని తెలిపారు. మరో అతిథి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ప్రముఖ రచయిత మధురాంతకం నరేంద్ర మాట్లాడుతూ వస్తువు కోసం వెతుకులాట కాకుండా తన లోకానుభవాలను, యథార్థ సంఘటలను రచయిత కథల్లో చిత్రించారని తెలిపారు. పుస్తకాన్ని సమీక్ష చేసిన మరో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత జిల్లేళ్ల బాలాజీ మాట్లాడుతూ సంపుటిలో తల్లి పడే ప్రసవ వేదన, శిశిర స్వప్నంలో బిడ్డల పట్ల తల్లిదండ్రుల బాధ్యతలను గుర్తు చేశారని తెలిపారు. తెలుగు భాషోద్యమ సమితి గౌరవాధ్యక్షురాలు గంగవరం శ్రీదేవి మాట్లాడు తూ నాగలి ప్రాధాన్యత, రైతులు స్థితిగతులను సంపుటిగా తేవడం రైతు బిడ్డగా అభినందనీయమన్నారు. తెలుగు భాషోద్యమ సమితి వ్యవ స్థాపకుడు సాకం నాగరాజు మాట్లాడుతూ పేరూ రు బాల సుబ్రమణ్యం జీవితమే ఒక పోరాట కథ అంటూ బాల్యదశ నుంచి నేటి వరకు ఎన్నో ఒడిదుడుకులను తట్టుకొని మంచి కథా రచయితగా పేరు పొందడం ప్రశంసనీయమన్నారు. తిరుపతి జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి మన్నవ గంగాధర ప్రసాద్ మాట్లాడుతూ రచయిత పేరూరు వ్యక్తిత్వమే తన కథల సారమని కొనియాడారు. రచయితలు విశ్వనాథరెడ్డి, వాకా ప్రసాద్, తోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నిరంతరం పుస్తకాలతో సావాసం చేస్తూ సాటి మనుషుల మధ్య జరిగిన సంఘటనలను కథా వస్తువులుగా అందరికీ అర్థమయ్యే రీతిలో రాయడం అభినందనీయమన్నారు. అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు యువశ్రీ మురళి, తెలుగు భాషోద్యమ సమితి సభ్యు లు టింకాలయ దామోదరం, దామోదర గుప్త, పొక్కళ్ల సుభద్ర, శశిధర్‌రాజు, నాదెండ్ల శ్రీమన్నారాయణ, తెలు గు ఆచార్యులు పీసీ వెంకటేశ్వర్లు, యువశ్రీ, సుహాసిని, కాంతా రావు, కొత్వాలు అమరేంద్ర, షణ్ముగం, గొడుగుచింత గోవింద య్య, జయపాల్, జయరాంప్రసాద్, కేశవులు,రాజు, పాల్గొన్నారు.

ఘనంగా ద్రౌపదీదేవి తిరునాళ్ల

నింద్ర: మండలంలోని అత్తూరు గ్రామంలో ఉన్న ద్రౌపదీదేవి ఆలయంలో తిరునాళ్ల ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు. ఉదయం ఆలయంలో దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని భక్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. ద్రౌపదీదేవి అమ్మవారికి వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. సాయంత్రం కంకణం ధరించిన భక్తులు వందలాదిమంది అగ్నిగుండం ప్రవేశం చేశారు. అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు.



అమ్మవారి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

పుంగనూరులో వ్యాపారుల ఘర్షణ

పుంగనూరు: పట్టణంలోని కొత్తయిండ్లులో ఆవుల వ్యాపారం చేస్తున్న అర్బాజ్‌కు జాఫర్‌కు మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఆదివారం ఇద్దరి మధ్య ఆవుల ధరల విషయమై వివాదం చెలరేగింది. దీనిపై జాఫర్ ఆవేశంతో అర్బాజ్‌పై దాడి చేసినట్లు విలేకరులకు తెలిపారు. గాయపడిన అర్బాజ్‌ను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్థానిక డాక్టర్ల సూచనల మేరకు అర్బాజ్‌ను మెరుగైన వైద్యం కోసం మదనపల్లె ఆస్పత్రికి తరలించారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి.. యువకుడి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పవన్‌కుమార్

చిత్తూరు అర్బన్: ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడడంతో యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం చిత్తూరు నగరం కాజూరుకు సమీపంలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ నిత్యబాబు కథనం మేరకు, నగరంలోని కయనికట్టువీధికి చెందిన పవన్‌కుమార్ (18), అతని స్నేహితుడు గోకుల కృష్ణ(23) కలిసి బంగారుపాళెం వైపు ద్విచక్రవాహనంలో బయల్దేరారు. కాజూరుకు సమీపంలో ముందు వెళుతున్న ఆటోను అధిగమించే క్రమంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో పవన్‌కుమార్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గోకులకృష్ణకు స్వల్పగాయాలు కావడంతో వెంటనే చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించి ఇంటికి పంపించారు. ఈ మేరకు కేసు నమోదు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మొగిలి ఘాట్‌లో వ్యక్తి మృతి



మృతి చెందిన వ్యక్తి

బంగారుపాళెం: మండలంలోని చెన్నై–బెంగళూరు జాతీయ రహదారి మొగిలి ఘాట్ వద్ద శనివారం రాత్రి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు, మొగిలి ఘాట్‌లో గుర్తుతెలియని వ్యక్తి నడుచుకుంటూ వస్తుండగా ఏనుగు దాడి చేయడంతో మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహం సమీపంలో రోడ్డు పక్కన ఏనుగు సంచరించిన అడుగులు ఉన్నాయని చెప్పారు. ఫారెస్టు సెక్షన్ అధికారి శివకుమార్‌ను వివరణ కోరగా రోడ్డు ప్రమాదంలో మృతి చెంది ఉంటాడని చెబుతున్నారు. మృతుని తలపై, చెంపపై గాయాలు ఏనుగు దాడి చేసి చనిపోయిన దెబ్బలుగా కనిపించడం లేదన్నారు. గుర్తుతెలియని వ్యక్తి ఎలా చనిపోయాడో, అతని చిరునామా ఏమిటో అనే విషయాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

మొదటి ఘాట్ రోడ్డులో ప్రమాదం

తిరుమల : మొదటి ఘాట్ రోడ్డులో మినీవ్యాన్ బ్రేక్ ఫెయిల్ కావడంతో ప్రమాదం చోటుచేసుకున్న సంఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. తిరుపతికి చెందిన ప్రైవేటు మినీ వ్యాన్లో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు శ్రీవారి దర్శనం చేసుకుని తిరుమల నుంచి తిరుపతికి బయలుదేరారు. ఈ వాహనం మొదటిఘాట్ రోడ్డులోని 35వ మలుపువద్దకు చేరుకోగానే అదుపు తప్పి పక్కనే ఉన్న రక్షణ గోడను ఢీకొంది. ఈ ప్రమాదంలో తొమ్మిది మంది భక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే సమాచారం అందుకున్న ఘాట్ రోడ్డు భద్రతా సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని అంబులెన్స్‌లో క్షతగాత్రులను తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అనంతరం ప్రమాదానికి గురైన వాహనాన్ని పక్కకు తొలగించి, వాహన రాకపోకలను పునరుద్ధరించారు.

కచ్చితత్వం లేని ఫలితం.. ప్రాణాంతకం

- కిట్ టెస్టుల్లో స్పష్టత రాని డెంగీ
- రోగుల ప్రాణాలకు పరీక్షలా స్ట్రిప్ ఫలితాలు
- రోగం ముదిరి పెద్దాస్పత్రులకు రెఫర్లు
- డెంగీకి కచ్చితమైన ఫలితం వచ్చే ఎలీసా టెస్ట్ తిరుపతిలోనే

పలమనేరు: వివిధ రకాల వైరల్ జ్వరాల్లో కచ్చితత్వం లేని పరీక్ష ఫలితాల వల్ల రోగులకు ప్రాణాల మీదకు వస్తోంది. మెడికల్ ల్యాబ్‌లు చేపట్టే రక్త పరీక్షల్లో స్పష్టమైన ఫలితాలు రావడం లేదు. ముఖ్యంగా డెంగీకి సంబంధించి స్థానిక ల్యాబ్‌లు లేదా ఏరియా ఆస్పత్రుల్లో చేసే కార్డ్, స్ట్రిప్ విధానంతోనే ఈ సమస్య వస్తోంది. నిర్లక్ష్యం చేస్తే రోగుల ప్రాణాల మీదకొస్తోంది. అప్పుడు పెద్దాస్పత్రులకు రెఫర్లుగా వెళ్లి లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ఆస్పత్రులకు వెళ్లే జ్వరపీడితులకు వారి రోగ తీవ్రతను బట్టి డాక్టర్లు వైద్య పరీక్షలకు ఆదేశిస్తారు. ముఖ్యంగా మలేరియా, టైఫాయిడ్, గున్యా, డెంగీ తదితర జ్వరాలు సోకినపుడు రక్త పరీక్ష కేంద్రాల నుంచి వచ్చే రిపోర్టులు రోగులతోపాటు డాక్టర్లను సైతం గందరగోళానికి గురి చేస్తున్నాయి.

ఒక్కో ల్యాబ్‌లో ఒక్కోరకంగా...

జిల్లాలో రెండొందలకు పైగా ప్రైవేటు రక్త పరీక్ష కేంద్రాలున్నాయి. వీటిల్లో ఓ రోగి ఒకే రోజు డెంగీ జ్వరానికి సంబంధించి మూడు చోట్ల పరీక్షలు చేయించుకుంటే మూడు రకాల రిపోర్టులొస్తున్నాయి. డెంగీకి సంబంధించిన ప్లేట్‌లైట్ కౌంట్‌లో మరీ తేడాలుంటున్నాయి. ఎలీసా కార్డ్, కిట్ విధానానికి ఫీజు రూ.400 ఉండగా ప్రైవేట్‌ల్యాబ్‌లలో రూ.700 దాకా వసూలు చేస్తున్నట్లు సమాచారం. తీరా వచ్చిన ఫలితాలతో రోగి మాత్రమే కాదు వైద్యులు సైతం గందరగోళానికి గురవుతున్నారు.





ప్రస్తుతం డెంగీని నిర్ధారించేందుకు ఉపయోగించే స్ట్రిప్. ఈడిస్ ఈజిప్ట్ దోమ(టైగర్)

జిల్లాకంతటికీ ఒకటే పరీక్షా కేంద్రం

డెంగీ రోగ నిర్ధారణకు సంబంధించి ఉమ్మడి చిత్తూరు జిల్లా మొత్తం మీద తిరుపతి రుయాలో మాత్రమే మైక్రో బయాలజీ ల్యాబ్‌లో పూర్తి స్థాయిలో ఎలీసా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఎలీసా ఎన్ఎస్ఐ, సీఎంలో ఐజీజీ, ఐజీఎంలాంటి నిర్దిష్టమైన ఫలితాలొస్తున్నాయి. దీంతో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి రోగులు అక్కడికెళ్లాలంటే వీలు కావడం లేదు. దానికి తోడు రోగుల పరిస్థితి విషమంగా ఉన్నపుడు వేలూరు సీఎంసీ, కుప్పం పీఈఎస్, బెంగుళూరు సెయింట్ జాన్స్ ఆస్పత్రుల్లో మాత్రమే మంచి ఫలితాలు వచ్చే రక్త పరీక్ష కేంద్రాలకెళ్లి టెస్టులు చేయించుకొని చికిత్సలు పొందాల్సి వస్తోంది.

మొదలైన డెంగీ సీజన్

డెంగీకి కారణమయ్యే ఈడిస్ ఈజిప్ట్ దోమ(టైగర్) ప్రస్తుతం జిల్లాలో ఎక్కువగా ఉంది. నల్లగా ఉండే ఈ దోమ ఒంటిమీద తెల్లని చారలు ఉంటాయి. పగటిపూట మాత్రం కుట్టే ఇది మూతలేని నీళ్ల ట్యాంకులు, పాత టైర్లులోని నిల్వ ఉన్న నీళ్లు, తారు రోడ్లు, సిమెంటుమీద నిల్వ ఉండే వర్షపునీరు, ఇళ్లలోని పూల కుండీలు, కూలర్లు, వాడకుండా వదిలేసిన పాత్రలు, కొబ్బరి చిప్పలు, చీకటిగా ఉండే మూలలు, కర్టెన్‌లు వంటి వేలాడే వస్తువులు, ఉపయోగించని గొడుగులు, అలంకరణ సామగ్రి కింద ఉంటాయి. కుట్టిన వారం తర్వాత హఠాత్తుగా తీవ్రమైన జ్వరం వస్తుంది. కాళ్లు కదిలించలేని పరిస్థితి ఉంటుంది, ఎముకల కండరాల్లో నొప్పి, శరీరంపై పొక్కులు, దద్దుర్లు రోగ లక్షణాలుగా పలమనేరు ఆర్ఎంవో డా.శారద తెలిపారు.

నిర్దిష్టమైన ఫలితాలు రావడం లేదు



డెంగీకి సంబంధించి స్థానికంగా చేసేవి స్క్రీనింగ్ టెస్టులు మాత్రమే. రోగ నిర్ధారణ పటిష్టంగా ఉండాలంటే కన్ఫర్మేషన్ టెస్ట్ కోసం తిరుపతి రుయా లేదా వేలూరు సీఎంసీ, బెంగళూరు సెయింట్ జాన్స్ ఆస్పత్రులకెళ్లాల్సిందే. ల్యాబ్‌లో జరిపే స్ట్రిప్ ఫలితాల్లో తేడాలొస్తున్నమాట నిజమే. అందుకే రెండు మూడు సార్లు పరీక్షలు చేయించాలి. డెంగీకి పటిష్టమైన ఫలితాలు ఉంటేనే చికిత్స చేసేందుకు వీలవుతుంది. అయితే రోగలక్షణాలను బట్టి కొంత నిర్ధారిస్తాం.

– డా.మల్లికార్జున రెడ్డి, మండల వైద్యాధికారి, పలమనేరు మండలం